క్లుప్తంగా

రోడ్డు పనులు పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రంగి: మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాలను కొనసాగించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పక్కన ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలో అంగన్‌వాడీ 02, 03 కేంద్రాలను కొనసాగించాలని గ్రామస్తులు ఎంపీడీవో చిరంజీవికి గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలను పెద్దబడిలోకి మార్చినందున ఇందులో అంగన్‌వాడీ కేంద్రాలను కొనసాగించాలన్నారు. చిన్నారులకు సరైనా గదులు, వసతులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పందిర్ల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గేదెకు టీకా వేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాలో పశువులకు వ్యాపిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణకు గురువారం పశువైద్య శిబిరం నిర్వహించి టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిణి రేణుక, సర్పంచ్ పెంటయ్య, రైతులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి, దుండ్రపల్లి గ్రామాల్లో 310 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు. సర్పంచులు వంగపల్లి సత్యనారాయణరెడ్డి, కందుల కరుణ, ఉపసర్పంచులు పర్శ మల్లేశం, కంకణాల పురుషోత్తంరెడ్డి, డాక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

మొక్కే లక్ష్యంగా..

- 24 నర్సరీలు..85,461 మొక్కలు
- టార్గెట్ 45,985..
- ఇంటింటికీ పంపిణీ చేసినవి 55,476
- లక్ష్యానికి మించి పంపిణీ
- కంటికి రెప్పలా కాపాడుతున్న రైతులు
- మొక్కల సంరక్షణ అధికారుల బాధ్యత

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరిత హారం కార్యక్రమంలో భాగంగా పల్లెల్లో జూలైలో మొక్కలు విరివిరిగా నాటుతున్నారు. మొక్కే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు ప్రస్తుతం ఒక ఉద్యమంలా గ్రామాల్లో మొక్కలు నాటుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు ఒక అడుగు ముందుకు వేసి ఇప్పటి వరకు లక్ష్యానికి మించి మొక్కలు నాటారు. ఎల్లారెడ్డిపేట మండలంలో 24 గ్రామాలుండగా, ప్రతి గ్రామంలో ఒక నర్సరీ చొప్పున 24 నర్సరీల్లో 85,461 వేల మొక్కలను పెంచాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగారు. ఈ సీజన్‌లో మండల వ్యాప్తంగా 45,985 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు సుమారు 55,476 మొక్కలు నాటి జిల్లాలోనే ఇక్కడి అధికారులు ముందున్నారు. అన్ని గ్రామాల్లోని రోడ్ల కిరువైపులా, రైతుల పొలం గట్లపై ఎక్కువగా మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు.



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు



మొక్కకు నీరు పోస్తున్న ఉపాధి సిబ్బంది



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

విత్తనం నాటిన నుంచి..

నర్సరీలలో విత్తనం నాటిన నుంచి మొక్క ఎదిగే వరకు ఇటు అధికారులు, అటు నిర్వాహకులు వాటిని కాపాడారు. మొదట నర్సరీలలో మట్టిని నిల్వ చేసి ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల చేత కవర్లలో మట్టిని సిద్ధం చేసి విత్తనాలు నాటారు. నర్సరీలలో బ్యాగుల్లో మట్టి నింపడం మొదలుకొని, విత్తనాలు నాటడంతో పాటు మొక్కలు చేతికొచ్చే వరకు వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత నిర్వాహకులపైనే ఉంటుందని అధికారులు మొదటి నుంచి వారిని అప్రమత్తం చేస్తూ వచ్చారు. ఈ సీజన్‌లో ఒక్క మొక్క కూడా చనిపోకుండా కాపాడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో విత్తన దశ నుంచే పనులను పరిశీలిస్తూ వచ్చారు.

మొలకెత్తే దశలో..

నర్సరీలలో మొక్కల పెంపకం ప్రక్రియను 15 రోజుల క్రితమే చేపట్టారు. మొదట బ్యాగులను సిద్ధం చేసి వాటిలో మట్టిని నింపారు. అనంతరం మట్టి బ్యాగుల్లో విత్తనాలను చల్లగా ప్రస్తుతం అవి మొలకెత్తి మొక్కలుగా ఎదిగాయి. అయితే మొలకెత్తే సమయంలోనే ఒక్క మొక్క కూడా చనిపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి రోజు జిల్లా, మండల స్థాయి అధికారులతో పాటు ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు నర్సరీల వద్దనే ఎక్కువ సమయం గడిపారు. నర్సరీలలో పెరుకుపోతున్న గడ్డిని తొలగించి ఎప్పటికప్పుడు నర్సరీని సిద్ధం చేస్తూ వచ్చారు. ఒక్క మొక్క చనిపోకుండా విధించిన లక్ష్యం ప్రకారం మొక్కలను అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యులు

మొక్కలు నాటిన నుంచి అవి మహావృక్షాలుగా ఎదిగే వరకు వాటి పూర్తి సంరక్షణ బాధ్యత ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లపైనే ఉంది. రోడ్లు, పొలం గట్లపై నాటిన మొక్కల చుట్టూ పెరుగుతున్న గడ్డిని తొలగించడం, ప్రతిరోజూ నీరు పట్టడం వరకు అన్ని పనులు ఉపాధి కూలీలతో చేయిస్తున్నారు. గతంలో నాటిన మొక్కలు ఎంతవరకు బతికాయి, ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అనే విషయంలో ఎంపీడీవో, ఏపీవోలు అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు.

మొక్కల సంరక్షణలో సిబ్బంది



నర్సరీలలో మొక్కలను సంరక్షించడంతో పాటు నాటిన ప్రతి మొక్కను కాపాడేలా ఉపాధి హామీ సిబ్బంది ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. నాటిన మొక్కల చుట్టూ పేరుకుపోయిన గడ్డిని తొలగించడమే కాకుండా, ప్రతిదినం నీరు పడుతూ వాటిని కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

- కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

టార్గెట్ ప్రకారం మొక్కల పెంపకం



24 గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ముందుగానే నిర్వాహకులకు లక్ష్యాన్ని నిర్దేశించాం. ఆ లక్ష్యం ప్రకారం ఆరునెలల కాలంలో పూర్తిస్థాయిలో లక్ష్యం ప్రకారం మొక్కలు నర్సరీలలో నిర్వాహకులు సిద్ధం చేశారు. లక్ష్యానికి మించి మొక్కలను నాటాం. నాటిన మొక్కలను కలెక్టర్ నుంచి మొదలుకొని కార్యదర్శి, ఫీల్డ్‌అసిస్టెంట్ల వరకు సంరక్షించేందుకు కృషి చేస్తున్నారు.

- చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

ప్రజలను మభ్యపెట్టేందుకే కొత్త పథకాలు

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లఅర్బన్: ప్రజలను మభ్య పెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలను ప్రవేశపెడుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ సర్పంచులు చేపట్టిన నిరాహారదీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామానికి ప్రథమ పౌరుడిగా సర్పంచ్ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించడంలో ముందుంటారని అన్నారు. సర్పంచులుగా విధుల నిర్వర్తించిన మాజీ సర్పంచుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకే కొత్త తరహా పథకాలను ప్రవేశపెడుతోందని, కానీ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. మాజీ సర్పంచుల డిమాండ్లను పరిష్కరించే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకునూరి బాలరాజ్, మోహినొద్దిన్, తిరుపతిరెడ్డి, నళినీకాంత్, ప్రశాంత్‌గౌడ్, మునిగెల రాజు, భరత్ గౌడ్, ఫయాజ్, సాయి, దేవరాజు, భాను, వేణుగోపాల్, పర్శరాములు, బాలు, మాజీ సర్పంచులు ఉన్నారు.



మాట్లాడుతున్న కేకే మహేందర్ రెడ్డి

అటెన్షన్ ప్లీజ్



మలుపుకాడ జాగ్రత్త

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం కొండాపూర్, నారాయణపూర్ గ్రామాల మధ్య రహదారి కోతకు గురైంది. ఇటీవలి భారీ వర్షాలకు కొండాపూర్ ఎల్లమ్మ ఆలయం వద్ద వున్న మలుపు వద్ద ఒకవైపు వున్న ఒర్రెతో రోడ్డు ఇలా కోతకు గురైంది. రెండువైపుల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ఏ మాత్రం ఏమరుపాటుగా వున్న ఒర్రెలో పడిపోవాల్సిందే. రాత్రివేళల్లో ఇంకా జాగ్రత్తగా వెళ్లాలి. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : ఇనాయతుల్లా, ఏఈ, పంచాయతీరాజ్, ముస్తాబాద్
సెల్‌నెంబర్: 98494 74383

గొర్రెలను పెంచుకోని ఉపాధి పొందాలి

ఎల్లారెడ్డిపేట: రెండవ విడత ప్రభుత్వం మంజూరు చేసిన గొర్రెలను సంరక్షించుకోని ఉపాధి పొందాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో రెండవ విడతలో 51 యూనిట్లను మంజూరు చేయగా, వాటిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేస్తుందని, ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, వ్యాక్సిన్లు సమయం ప్రకారం వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిణి రేణుక, సర్పంచ్ తెడ్డు అమృత, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిత్రం నాగరాజు, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.



గొర్రెలను పరిశీలిస్తున్న లక్ష్మణ్‌రావు

విద్యార్థులకు రెడ్‌రన్ మారథాన్



బహుమతి అందజేస్తున్న వైద్యసిబ్బంది

సిరిసిల్లటౌన్: యూత్ ఫెస్ట్–2023లో భాగంగా తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ గురువారం సిరిసిల్లలోని డిగ్రీ విద్యార్థులకు 5కే రెడ్ రన్ మారథాన్ నిర్వహించింది. పోటీలను డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి బి.సతీశ్, ద్వితీయ ఎస్‌కే ఇమ్రాన్, తృతీయ కే సౌజన్య గెలుచుకున్నారు. వైద్యులు ఎస్.రజిత, నయీంజాహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

రుద్రంగి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆద్యగోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ అన్నారు. గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ తర్రె ప్రభలతతో కలిసి జెడ్పీ హైస్కూల్ 8, 9, 10వ తరగతి 240 మంది విద్యార్థులకు గురువారం స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తితే ఫౌండేషన్ సహకరిస్తుందన్నారు. నాయకులు తర్రె మనోహర్, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు అన్నారు.



స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న గోలి మోహన్

నారాయణరెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం



పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కుర్ర నారాయణరెడ్డి తల్లి సత్తవ్వ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆగయ్య మాట్లాడుతూ నారాయణరెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సర్పంచ్ కొత్తపల్లి వాణి, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, మాజీ ఎంపీటీసీ దేవరాజు, తడకల స్వామి పాల్గొన్నారు.

పరామర్శ

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన జంగపెల్లి తిరుమల అనే యువతి అనారోగ్యంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేరగా బాధితురాలిని తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పరామర్శించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ



బోయినపల్లిలో దరఖాస్తుదారుల క్యూ

వేములవాడ: గృహలక్ష్మి పథకంలో దరఖాస్తులు చేసుకునేందుకు గురువారం చివరి రోజు కావడంతో జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల వద్ద దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇళ్లు లేనివారు పెద్ద సంఖ్యలో కార్యాలయానికి చేరుకోవడంతో కార్యాలయం రద్దీగా మారింది. దరఖాస్తులు చేసుకున్న వారికి రశీదులు ఇవ్వకపోవడంతో పలువురు ఆందోళనకు దిగారు. దీంతో చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్, మేనేజర్ సంపత్‌రెడ్డిలు కలుగజేసుకుని తమ సిబ్బంది ద్వారా రశీదులు ఇప్పించారు.

కోనరావుపేట: మండలంలోని 28 గ్రామాల్లో కలిపి మొత్తం కలిపి 1,690 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఈనెల 20 వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుందని, ఈనెల 25న మంజూరు పత్రాలను అందించనున్నట్లు తెలిపారు.

ముస్తాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో 506 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఇప్పటి వరకు 1,173 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

తంగళ్లపల్లి: ఎంపీడీవో కార్యాలయం దరఖాస్తుదారులతో కిక్కిరిసిపోయింది. గురువారం ఒక్కరోజే 576 గృహలక్ష్మి దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు. తంగళ్లపల్లి మండలంలో మొత్తంగా 1,742 దరఖాస్తులు వచ్చాయి.

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 1,120 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో నరేశ్‌కుమార్ తెలిపారు.

బోయినపల్లి: మండలంలో 1,245 దరఖాస్తులు అందినట్లు సీనియర్ అసిస్టెంట్ ఆరిఫ్ గురువారం సాయంత్రం తెలిపారు.

రుద్రంగి: మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు బారులు తీరారు.

సంక్షిప్త వార్తలు

వర్క్‌బుక్స్ పంపిణీ



ముస్తాబాద్: ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఇంటి వద్ద చేసుకునే హోంవర్క్ కోసం ప్రభుత్వం కొత్తగా వర్క్‌బుక్స్‌ను అందిస్తోందని ఎంఈవో బన్నాజీ తెలిపారు. మండల వనరుల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు వర్క్‌బుక్స్‌ను గురువారం పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, యాదగిరి, సదానందం, పద్మకళ, ఉద్యోగులు శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్, సీఆర్‌పీలు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ముస్తాబాద్: మండల కేంద్రంలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, దబ్బెడ రాజు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

కోనరావుపేట: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉమాశంకర్‌ను పలువురు నాయకులు కలిసి సన్మానించారు. దళిత నాయకులు బడే అంజి, తడగొండ లక్ష్మణ్, రజక సంఘం నాయకుడు రాజు కలిశారు. ఆయనకు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

గృహలక్ష్మి దరఖాస్తుకు గడువు పెంచాలి

ఇల్లంతకుంట: గృహలక్ష్మి దరఖాస్తుకు ప్రభుత్వం మూడు రోజులు గడువు పెట్టడం సరికాదని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ బత్తిని స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో గృహలక్ష్మి దరఖాస్తు గడువు పొడిగించాలి అని ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

కేకే పరామర్శ

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట, వీర్నపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన భుక్య ప్రవీణ్, మ్యాకల దేవయ్య కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున అండగా ఉంటామన్నారు.

పత్తి, వరి పంటల పరిశీలన

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటలను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్ శాస్త్రవేత్తలు ఉషారాణి, రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత దంత వైద్యశిబిరం

సిరిసిల్లటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని చైతన్యభారతి పాఠశాలలో చిన్నారులకు గురువారం ఉచిత దంత వైద్యశిబిరం జరిగింది. డాక్టర్ విజయ్, వసుంధర చిన్నారుల తల్లిదండ్రులకు సూచనలు చేశారు. పిల్లలు వాడే బ్రష్‌లను ఉచితంగా అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆడెపు కళ్యాణి, కరెస్పాండెంట్ ఆడెపు రవీందర్, రేవంత్ పాల్గొన్నారు.

సమాచారం

అవర్లీ బేస్డ్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో తాత్కాలిక ప్రాతిపదికన అవర్లీ బేస్డ్(హెచ్‌బీటీ) టీచర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు టీజీటీ–1, హిందీ పీజీటీ–1, ఇంగ్లిష్ పీజీటీ–2, ఇంగ్లిష్ టీజీటీ–1 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హతగల అభ్యర్థులు ఈ నెల 15 లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తంగళ్లపల్లి: మండలంలోని తెలంగాణ గిరిజన మహిళా సంక్షేమ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ కె.రజిని తెలిపారు. బీకాం (సీఏ), బీఎస్సీ(లైఫ్‌సైన్స్), బీఎస్సీ(ఫిజికల్ సైన్స్), బీఏ కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు 95020 82958, 97037 09376 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పాత పింఛన్ విధానం సాధిస్తాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నూర్జా అలీబేగ్

సిరిసిల్లటౌన్: పాతపెన్షన్ విధానాన్ని సాధిస్తామని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. పాతపెన్షన్ విధానం సాధనకై ఈనెల 12న నిర్వహిస్తున్న ×ఛలో హైదరాబాద్×కి కార్యక్రమ పోస్టర్లను సిరిసిల్ల మున్సిపల్ మేనేజర్ నూర్జా అలీబేగ్ గురువారం సాయంత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి యూనియన్లకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీగా హాజరు కావాలని కోరారు. వెంకటేశ్, నవీన్, వినయ్, అంజాగౌడ్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్లఅర్బన్: స్థానిక గాయత్రి కోఆపరేటివ్ బ్యాంక్ ఖాతాదారుడు అస్స రాజనర్సు ప్రమాదవశాత్తు మృతిచెందగా ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబసభ్యులకు గురువారం అందజేశారు. రూ.లక్ష చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చేతుల మీదుగా అస్స విజయకు అందజేశారు. కార్యక్రమంలో తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస, మండెపల్లి ఎంపీటీసీ బుస్స స్వప్న, బ్రాంచ్ మేనేజర్ సమ్మెట శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితమే డిగ్రీ కళాశాల

వీర్నపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా ఏర్పాటయ్యిందని స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్ రాకేశ్, తరుణ్, సంజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొంటూ బీజేపీ నాయకులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు సంతోష్ హైదరాబాద్‌లో ఓ దళితుడిపై దాడి చేసిన ఓ వర్గం యువకుడిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడ్డ దళిత యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి దళితులపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దళితుడిని వేధించిన సదరు యువకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మామిడి హరీశ్, స్వామి, శ్రావణ్, ప్రసన్న, సంపత్, అనిల్, శ్రీకాంత్, రాజు, చింటు, ప్రశాంత్, శ్రీకాంత్ ఉన్నారు.